


TE TL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:83 | 05-08-2026 బుధవారం | పేజీలు: 08 | వెల 3/-



# పాలిటిక్స్ లో షార్ట్ ఫార్ములా

## షార్ట్ వీడియోలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు

- ఇన్‌స్టా చుట్టూ రాజకీయ ప్రచారం..
- జెన్ జీని టార్గెట్ చేస్తున్న నేతలు
- ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్‌స్‌పై పార్టీల ప్రత్యేక దృష్టి
- జెన్ జీ ఓటర్ల అభిరుచులకు అనుగుణంగా మారుతున్న రాజకీయ వ్యూహాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:**

దేశంలో ఎన్నికల ప్రచార శైలి వేగంగా మారుతోంది. ఒకప్పుడు వార్తాపత్రికల ప్రకటనలు, బహిరంగ సభలు, ప్రెస్‌మీట్లు ప్రధాన ప్రచార సాధనాలుగా ఉండగా.. ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ రాజకీయ ప్రచారంలో కీలక వేదికలుగా మారుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సీనియర్ నాయకుల నుంచి యువ నేతల వరకు అందరూ డిజిటల్ వేదికల ద్వారా యువ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

**జెన్ జీ ఓటర్లే ప్రధాన లక్ష్యం**

18 నుంచి 27 ఏళ్ల మధ్య వయస్సు గల జెన్ జీ ఓటర్ల ఆలోచనా విధానం రాజకీయ పార్టీల ప్రచార వ్యూహాలను ప్రభావితం చేస్తోంది. ఈ తరం ఫేస్‌బుక్ కంటే ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి

మిగతా 2వ పేజీలో..



## పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

- పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

2



## ప్రతి గింజా ప్రజల ఆస్తే

- డిఫాల్ట్ మిల్లర్ల నుంచి ప్రతి పైసా, ప్రతి గింజా వసూలు
- నిజాయతీ మిల్లర్లకు పూర్తి రక్షణ
- దశాబ్ద కాలపు సీఎంఆర్‌పై ఆడిట్‌కు మంత్రి ఉత్తమ్ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 4 :**

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తరువాత తొలిసారిగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై గత పది నుంచి 12 సంవత్సరాల కార్యకలాపాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం సేకరణ నుంచి బియ్యం అప్పగింత వరకు జరిగిన ప్రతి లావాదేవీ, మిల్లర్ల వారీగా డిఫాల్‌ట్‌లు, పెండింగ్ బకాయిలు, రికవరీలు, విజిలెన్స్ దర్యాప్తులు, న్యాయపరమైన చర్యలు, అమలు వ్యవస్థలను క్షుణ్ణంగా సమీక్షించి భవిష్యత్తులో ఎలాంటి లోపాలకు తావు

మిగతా 2వ పేజీలో..



## సమగ్ర అభివృద్ధికి విద్యే కీలకం

- వీసీల సమావేశంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్, ఆగస్ట్ 4:**

సమగ్ర అభివృద్ధికి విద్యనే కీలకమని గవర్నర్, యూనివర్సిటీల చాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో గవర్నర్' అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సమావేశం, నషా ముక్తే యువ వికసిత్ భారత్, మై భారత్ పోర్టల్, రెడ్ క్రాస్ సొసైటీ తదితర అంశాల్లో విద్యార్థుల భాగస్వామ్యం,

మిగతా 2వ పేజీలో..

## కాళేశ్వరం విలువ తెలిసి వస్తోంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2



7

## నీలోఫర్ లో బాలింతలకు కనీస వైద్య సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరం

- హాస్పిటల్ లో వసతులను పరిశీలిస్తామంటే మాపై దౌర్జన్యం చేశారు
- ప్రభుత్వం మెడలు వంచి బాలింతలకు సరైన వైద్య సదుపాయాలు అందేలా చూస్తాం

## అగమ్యగోచరంగా ప్రభుత్వ హాస్పిటల్స్

2

- ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు
- కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



## అభివృద్ధికి అవినీతే ప్రధాన అడ్డంకి

'బ్రిక్స్' దేశాల మధ్య సహకారం బలోపేతం కావాలి

భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా

ప్రారంభమైన ఏసీడబ్ల్యూజీ సమావేశం

3






## మసాలాల్లో మహా కల్తీ

- 25 టన్నుల నకిలీ మసాలా స్వాధీనం.. మరో 89 టన్నుల నిల్వలు గుర్తింపు
- కాటేదాన్‌లో హెచ్-ఫాస్ట్ భారీ దాడులు
- ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులతో మసాలాల తయారీ
- ప్రముఖ బ్రాండ్ల పేర్లతో మార్కెట్లో విక్రయాలు
- 13 వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించిన అధికారులు
- కల్తీ ఆహారంతో తీవ్ర ఆరోగ్య సమస్యల ప్రమాదమని హెచ్చరిక

2

## ఇక సర్కారు కార్యాలయాలకు టీ-ఫైబర్ నెట్ సేవలు

- మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు

**హైదరాబాద్, ప్రజాతంత్ర, ఆగస్టు 4 :**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కేవలం టీఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. టీఫైబర్ సేవలపై తన కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు. గడువులోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్నెట్ సేవలు అందించేలా

మిగతా 2వ పేజీలో..



## అభ్యంతరకర పోస్టులపై ఫిర్యాదు చేయడం తప్పా?

- డీసీపీ ఆనంద్‌బాబును ఎందుకు బదిలీ చేశారు
- రాహుల్‌పై విమర్శలు చేస్తే ఇలాగే వదిలేస్తారా
- సీఎం రేవంత్‌పై కిషన్ రెడ్డి విమర్శలు



2

## అభ్యంతరకర పోస్టులపై ఫిర్యాదు చేయడం తప్పా?

**హైదరాబాద్, ఆగస్ట్ 4:**

ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని ప్రభుత్వం బదిలీ చేసిందన్నారు. కిషన్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా అని ప్రశ్నించారు. సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని ప్రకటించారు. వేలంలో పాల్గొనేందుకు అనేకమంది ముందుకొచ్చారు కానీ సింగరేణి కష్టాలను దృష్టిలో ఉంచుకునే కేటాయించినట్లు వివరించారు. నైనీ, తాడిచర్ల బ్లాక్ 2, మణుగూరు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కొత్త బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణికి కొత్త ఆశలు వస్తాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సింగరేణిని దోచుకున్నాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## అగమ్యగోచరంగా ప్రభుత్వ హాస్పిటల్స్

**హైదరాబాద్,ఆగస్ట్ 4:**

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ హాస్పిటల్స్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టుపెట్టారు. రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ఎంసీహెచ్, జిల్లా హాస్పిటల్స్, ఏరియా హాస్పిటల్స్, సీహెచ్సీలు మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్పిటల్స్ పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీష్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో శాఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రోడ్లెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

**హైదరాబాద్, ఆగస్టు 4 :**

పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతోపాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియమనిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్న పత్రాల తయారీ, ముద్రణ, రవాణాతోపాటు అన్ని ప్రక్రియలలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక సర్కారు కార్యాలయాలకు టీఫైబర్ నెట్ సేవలు

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాట్లు చేయాలని టీ ఫైబర్ అధికారులకు సూచించారు. సెప్టెంబర్ 1 తర్వాత ప్రైవేట్ ఆపరేటర్లకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ నిమిత్తం ఎలాంటి బిల్లులు చెల్లించొద్దని, 'టీస్వాన్'(TSWAN) నెట్‌వర్క్‌ను నెల రోజుల్లోగా టీఫైబర్‌కు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ'కి కూడా పూర్తిస్థాయిలో టీఫైబర్ ఇంటర్నెట్ సేవలు అందేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలో చేపట్టిన 'ఇంటింటికి ఇంటర్నెట్ ' ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు తప ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి గింజా ప్రజల ఆస్తే

**మొదటిపేజీ తరువాయి**

లేకుండా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో గత దశాబ్ద కాలంగా జరిగిన ధాన్యం సేకరణ, సీఎంఆర్ బకాయిలు, ఎఫ్‌సీఐకి అప్పగించిన బియ్యం, జిల్లాల వారీగా, మిల్లర్ల వారీగా పెండింగ్ డిఫాల్ట్‌లు, రికవరీల పురోగతి, విజిలెన్స్ కేసులు, న్యాయపరమైన చర్యలను విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం శిక్షలు విధించడం మాత్రమే కాదని, ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ధాన్యాన్ని, ప్రభుత్వానికి రావలసిన ప్రతి రూపాయిని పూర్తిగా తిరిగి రాబట్టడమేనని స్పష్టం చేశారు. అధికారులు వివరించిన మేరకు పెండింగ్ బకాయిల్లో ఎక్కువ భాగం గత ప్రభుత్వాల కాలంలో పేరుకుపోయినవేనని, ప్రస్తుతం వాటి రికవరీకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నగదు రూపంలో చెల్లింపులు, ధాన్యం తిరిగి అప్పగింత, నాణ్యమైన బియ్యం సరఫరా వంటి అన్ని మార్గాల ద్వారా గరిష్ఠ స్థాయిలో రికవరీలు సాధించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డిఫాల్ట్ మిల్లర్లకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన పరిమిత గడువు కారణంగా ఇప్పటికే గణనీయమైన రికవరీలు జరిగాయని అధికారులు తెలిపారు. మిగిలిన ప్రతి కేసుపై మిల్లరు వారీగా గడువు నిర్ధారించి ప్రత్యేక రికవరీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

**ప్రతీ ధాన్యం గింజ వెనుక రైతు చెమట, ప్రజల సొమ్ము**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కింద కొనుగోలు చేసే ప్రతీ ధాన్యం గింజ వెనుక రైతు చెమటతోపాటు ప్రజల సొమ్ము ఉందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం ఎంపిక చేసిన రైస్ మిల్లర్లకు అప్పగిస్తుందని, వారు ఒప్పందం ప్రకారం నిర్దేశిత పరిమాణం, నాణ్యతతో బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని గుర్తు చేశారు. మిల్లర్‌కు అప్పగించే ప్రతి బస్తా ధాన్యం ప్రభుత్వ ఆస్తి. అది ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తి. అందులో ఒక్క గింజ దారి మళ్లినా అది ప్రజలకు నష్టం. ప్రభుత్వానికి రావలసిన ఒక్క టన్ను బియ్యం తగ్గినా ప్రజా పంపిణీ వ్యవస్థ బలహీనపడుతుంది అని మంత్రి ఘాటుగా హెచ్చరించారు. రాష్ట్రంలోని అత్యధికమంది రైస్ మిల్లర్లు నిజాయతీగా ప్రభుత్వంతో కలిసి పనిచేశారని, కొద్దిమంది మాత్రమే బియ్యం అప్పగింతలో జాప్యం చేయడం, ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించడం, ఒప్పందాలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు.

**విజిలెన్స్ దాడులు కొనసాగుతాయి**

ప్రభుత్వ ధాన్యంపై నిర్వహించిన తనిఖీలు, దాడులు, నమోదు చేసిన క్రిమినల్ కేసులు, రికవరీలు, న్యాయపరమైన చర్యలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలు సమగ్ర నివేదిక సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లుల్లో భౌతిక తనిఖీలు, స్టాక్‌ల ధ్రువీకరణ, స్టాక్ రిజిస్టర్ల పరిశీలన, కొనుగోలు రికార్డులతో సరిపోల్చడం, ప్రభుత్వ ధాన్యం లేదా బియ్యం అక్రమ మళ్లింపులపై లోతైన విచారణ కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. మోసం, ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగం, నమ్మక ద్రోహం వంటి నేరాలకు ఆధారాలు లభించిన ప్రతి సందర్భంలో క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు పదేపదే డిఫాల్ట్ చేస్తున్న మిల్లర్లపై బ్లాక్‌లిస్టింగ్ సహా కఠిన పరిపాలనా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

**సీఎంఆర్ వ్యవస్థలో సమూల సంస్కరణలు**

గత డిఫాల్ట్‌ల సమీక్షతోపాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సీఎంఆర్ నియంత్రణ ఉత్తర్వులను పూర్తిగా సవరించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఒప్పంద నిబంధనలను మరింత కఠినతరం చేయడం, బ్యాంకు గ్యారంటీలను బలోపేతం చేయడం, డిఫాల్ట్‌లపై కఠిన శిక్షలు, అమలు వ్యవస్థను మరింత సమర్థవంతంగా రూపొందించడం వంటి అంశాలను కొత్త విధానంలో చేర్చనున్నారు. పెండింగ్ రికవరీలు, ఆస్తుల జప్తు, బ్యాంకు గ్యారంటీల అమలు, సివిల్, క్రిమినల్ కేసుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించి రికవరీలకు అడ్డంకిగా ఉన్న ప్రతి పరిపాలనా అవరోధాన్ని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. రైతు చెమటతో పండిన ప్రతి గింజను ప్రభుత్వం ప్రజల సొమ్ముతో కొనుగోలు చేస్తున్నందున ప్రతి గింజకు ప్రభుత్వం కాపలాదారు. ప్రజల ఆస్తిని కాపాడటంలో, ప్రభుత్వ బకాయిలను పూర్తిగా రాబట్టడంలో, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

**సాంకేతికతతో కట్టుదిట్టమైన పర్యవేక్షణ**

భవిష్యత్తులో ఒక్క గింజ కూడా దారి మళ్లకుండా సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవేశపెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిలో క్యూఆర్ కోడ్‌తో గన్నీ సంచులు, జీపీఎస్ ఆధారిత వాహన ట్రాకింగ్, జియో ట్యాగ్ తనిఖీలు, రియల్ టైమ్ స్టాక్ రీకన్సిలియేషన్, ప్రొక్యూర్‌మెంట్ -మిల్లింగ్ -ఎఫ్‌సీఐ డేటాబేస్‌ల అనుసంధానం, ఎర్లీ వార్నింగ్ వ్యవస్థ, రిస్క్ ఆధారిత మిల్లుల ఆడిట్లు వంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. డిఫాల్ట్‌ల కారణంగా రైతులు ఏ విధంగానూ ఇబ్బందిపడరని మంత్రి స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాల్లో నేరుగా సకాలంలో చెల్లింపులు, సేకరణ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతాయని హామీ ఇచ్చారు. 'ప్రభుత్వంతో నిజాఅతీగా పనిచేస్తున్న రైస్ మిల్లర్లకు భయపడాల్సిన అవసరం లేదు.. వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. అయితే ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించే వారు, ఒప్పందాలను ఉల్లంఘించే వారు మాత్రం ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు' అని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొక్యూర్‌మెంట్, ఫైనాన్స్, లాజిస్టిక్స్, లీగల్, మార్కెటింగ్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలిటిక్స్ లో 'షార్ట్'ఫార్ములా

**మొదటిపేజీ తరువాయి**

గడుపుతోంది. దీంతో రాజకీయ సందేశాలను కూడా అదే తరహాలో రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. యువతను చేరుకునేందుకు చిన్న నిడివి వీడియోలకు ప్రాధాన్యం పెరుగుతోంది. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ నిర్ణయాలు, ప్రత్యర్థులపై విమర్శలు వంటి అంశాలను కూడా సంక్షిప్త వీడియోల రూపంలో ప్రజలకు చేరవేస్తున్నారు.

**సెకన్లలోనే సందేశం చేరేలా వ్యూహం**

గంటల తరబడి ప్రసంగాల కంటే 15 నుంచి 30 సెకన్లలోనే బలమైన సందేశాన్ని అందించే కంటెంట్‌కు రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. సెల్ఫీ వీడియోలు, నేరుగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడే విధానం, యువతకు దగ్గరైన భాషను ఉపయోగించడం వంటి మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యేలా వీడియోలను రూపొందించేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. ప్రచారంలో విజువల్ ప్రజెంటేషన్, భావోద్వేగాలు, సరళమైన సందేశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

**పీఆర్ బృందాల పాత్ర పెరుగుతోంది**

డిజిటల్ ప్రచారం కోసం రాజకీయ నాయకులు ప్రత్యేక ప్రజాసంబంధాల సంస్థలు, సోషల్ మీడియా నిపుణుల సేవలను వినియోగిస్తున్నారు. వీడియోల స్క్రిప్టులు, చిత్రీకరణ, ఎడిటింగ్, ప్రచార వ్యూహాలన్నింటినీ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. అయితే జెన్ జీ అభిరుచులు వేగంగా మారుతుండటంతో ప్రతి ప్రచారం విజయవంతం అవుతుందనే హామీ లేదు. అందుకే కొత్త ధోరణులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ వ్యూహాలను మార్చుకుంటున్నారు.

**వైరల్ కావడం ఒకటి.. ఓట్లుగా మారడం మరోటి**

సామాజిక మాధ్యమాల్లో లక్షల వ్యూస్, లైక్‌లు రావడం సులభమే అయినప్పటికీ వాటిని ఓట్లుగా మార్చుకోవడం మాత్రం రాజకీయ పార్టీలకు పెద్ద సవాల్‌గా మారింది. కృత్రిమంగా రూపొందించిన ప్రచారాన్ని యువత త్వరగా గుర్తించి ట్రోల్స్, మీమ్స్ రూపంలో వ్యతిరేక ప్రచారం చేసే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. అందుకే సహజత్వం, విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇస్తూ డిజిటల్ ప్రచారాన్ని రూపొందించేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ రాజకీయ ప్రచారంలో మరింత కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కాళేశ్వరం విలువ తెలిసి వస్తోంది

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, ఆగస్ట్ 4:**

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాముఖ్యతను మరోసారి నిరూపిస్తోందని అన్నారు. రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువను పునరుజ్జీవింపజేస్తూ వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసి సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ రాష్ట్ర రైతుకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాను ఇస్తున్నదని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ఈ నీటిని తమ పొలాల్లో చూస్తున్న రైతన్నలకు నిజాలేమిటో తెలుసని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న వీడియోను షేర్ చేశారు.



## సమగ్ర అభివృద్ధికి విద్యే కీలకం

**మొదటిపేజీ తరువాయి**

పేర్ల నమోదుపై లోక్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఉన్నత విద్యను సమీక్షించారు. యూనివర్సిటీలు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా గ్రామీణ, వెనుకబడిన వర్గాలకు తమ సేవలను విస్తరించాలని సూచించారు. దేశంలోని మానవ వనరుల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే యువతకు విజ్ఞానంతో పాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా ఎంజీయూ వీసీతోపాటు పలువురు వీసీలు మొదటి తరం విద్యార్థులలో ఆరోగ్య అవగాహన, హెచ్ఐబీ నివారణ, రక్తదానం, జీవన నైపుణ్యాల పెంపొందించడంలో రెడ్ రిబ్బన్ క్లబ్ లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రస్తావించారు. దీనిలో భాగంగా సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ఏఎస్ఆర్ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రభుత్వం, పౌర సమాజంతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ లోక్ భవన్ తో సమన్వయంతో ముందుకు సాగాలని వీసీలు నిర్ణయించారు. సమావేశంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలను వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ వివరించారు. ఉన్నత విద్యా రంగానికి విశేష సేవలు అందిస్తున్న సీనియర్ వైస్ చాన్సలర్లలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్ ను గవర్నర్ పుష్పగుచ్చాలు అందచేసి ఘనంగా సన్మానించి అభినందించారు.

# మసాలాల్లో మహా కల్తీ

**హైదరాబాద్, ఆగస్టు 4:**

హైదరాబాద్‌లోని కాటేదాన్ ప్రాంతంలో హెచ్‌ఫాస్ట్ అధికారులు భారీ కల్తీ మసాలా దందాను వెలికితీశారు. అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో నకిలీ మసాలా దినుసులు తయారు చేస్తున్న ముఠాపై నిర్వహించిన దాడుల్లో 25 టన్నుల కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకున్నారు. తయారీకి సిద్ధంగా ఉంచిన మరో 89 టన్నుల ముడి నిల్వలను కూడా అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**ప్రమాదకర రసాయనాలతో కల్తీ**

విచారణలో జీలకర్ర, లవంగాలు, షాజీరా, ఆవాలు, మెంతులు, సోంపు, చిన్న ఆవాలు వంటి నిత్యావసర మసాలా దినుసులకు బట్టలకు రంగులు అద్దేందుకు ఉపయోగించే ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు కలుపుతున్నట్లు తేలింది. లవంగాల నుంచి నూనె తీసిన తర్వాత మిగిలే వ్యర్థాలను సేకరించి వాటికి హానికర రసాయనాలు కలిపి మళ్లీ విక్రయానికి సిద్ధం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.



**బ్రాండెడ్ పేర్లతో విక్రయాలు**

కల్తీ చేసిన మసాలాలకు ప్రముఖ బ్రాండ్ల ముద్రలు వేసి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు విచారణలో బయటపడింది. ఈ ప్రాసెసింగ్ కోసం ప్రత్యేక యంత్రాలను ఇండోర్ నుంచి తెప్పించి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. తక్కువ ధరలకు విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తించారు.

**13 సంస్థల్లో సోదాలు**

ఈ దాడుల వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి మసాలాలకు రంగు, మెరుపు తీసుకురావడానికి ఇండస్ట్రియల్ ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్, కొన్ని చోట్ల హెయిర్ కలర్ కూడా ఉపయోగిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు.

**ప్రజలకు హెచ్చరిక**

ఇలాంటి కల్తీ ఆహార పదార్థాలను వినియోగించడం వల్ల కాలేయం, మూత్రపిండాల సమస్యలు, క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు వచ్చే ప్రమాదం ఉందని సజ్జనార్ హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపామని, ఆహార భద్రతా చట్టం ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హెచ్‌ఫాస్ట్ ఏర్పాటు చేసిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 202 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మొత్తం 246 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అనుమానాస్పద ఆహార పదార్థాలు లేదా కల్తీ తయారీ కేంద్రాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# అభివృద్ధికి అవినీతే ప్రధాన అడ్డంకి

హైదరాబాద్, ఆగస్టు 4 :

సుస్థిరమైన, సమ్మిళితమైన అభివృద్ధికి అవినీతి ప్రధాన ఆటంకంగా ఉందని 'బ్రిక్స్' అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్(ఏసీడబ్ల్యూజీ) సమావేశం అభిప్రాయపడింది. పరారీలో ఉన్న నేరస్తులను పట్టుకోవడానికి, అక్రమ ఆస్తుల రికవరీలో 'బ్రిక్స్' దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించింది. రెండు రోజులు నిర్వహించే ఈ సమావేశాలు హైదరాబాద్‌లో మంగళవారం ప్రారంభం కాగా భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి అనే సవాలుకు ఏ దేశమూ మినహాయింపు కాదని, ఏ దేశమూ దీన్ని ఒంటరిగా ఎదుర్కోలేదని స్పష్టం చేశారు. అక్రమ ఆర్థిక మళ్లింపులను నివారించి, ప్రజా వనరులను పరిరక్షించడానికి, అంతర్జాతీయ అవినీతి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సమష్టిగా, సమన్వయంతో కూడిన, నిరంతర అంతర్జాతీయ సహకారానికి ఆమె పిలుపునిచ్చారు. సమగ్రత, జవాబుదారీతనం, అంతర్జాతీయ సహకారం, ఆవిష్కరణల బలోపేతం అత్యంత ముఖ్యమైనవిగా మారిన ఈ సమయంలో బ్రిక్స్ ఏసీడబ్ల్యూజీ రెండో సమావేశం జరుగుతోందని రచనా షా తెలిపారు. సీమాంతర అవినీతిని ఎదుర్కోవడంపై తన ఉమ్మడి బాధ్యతను బ్రిక్స్ ఆచరణాత్మక సహకారంగా, స్పష్టమైన ఫలితాలుగా మార్చాలన్నారు. నేరాల నుంచి లబ్ధి పొందే వారికి ఏ దేశమూ ఆశ్రయంగా మారకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించడం, దొంగిలించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, నేరస్తులు, అక్రమ నిధులు సరిహద్దులు దాటి తరలిపోవడానికి అవకాశం కల్పిస్తున్న లోపాల తొలగింపులో బలమైన సహకారానికి ఆమె పిలుపునిచ్చారు. అవినీతి ఆరోపణలతో పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించేందుకు ఏర్పాటు చేసిన అనధికారిక సహకార బ్రిక్స్ భాండాగారం విషయంలో సాధించిన పురోగతిని స్వాగతించారు. అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నిందితుల విషయంలో, వారి అప్పగింతకు మద్దతు ఇచ్చేందుకు, బ్రిక్స్ దేశాల మధ్య అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్‌పై జరుగుతున్న చర్చలను, బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ కార్యకలాపాలు ప్రారంభించటాన్ని కూడా స్వాగతించారు. సమాచార మార్పిడి కోసం రూపొందించిన ప్రామాణిక టెంప్లేట్, స్థానిక నోడల్ పాయింట్లు, నిపుణుల డైరెక్టరీతో కలిసి చట్టాన్ని అమలు చేసే సంస్థల మధ్య వేగవంతమైన, మరింత ప్రత్యక్షమైన, అత్యంత ప్రభావవంతమైన సహకారాన్ని సులభతరం చేస్తాయన్నారు. నివారణాత్మక అప్రమత్తత, సాంకేతికత ఆధారిత పరిపాలనకు పెద్దపీట వేస్తూ అవినీతి ముప్పును ఎదుర్కొనే పరిష్కారంలో సాంకేతికతే కీలకమని కార్యదర్శి అన్నారు. డిజిటల్ గుర్తింపు, ఎలక్ట్రానిక్ సేవలందించే విధానం, డిజిటల్ చెల్లింపులు, పారదర్శక కొనుగోలు వ్యవస్థలు వృథాను తగ్గించగలవని, అధికారుల విచక్షణాధికారాలకు కళ్లెం వేయగలవని, ప్రజా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయగలవని పేర్కొన్నారు. దేశ జాతీయ ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ అయిన గవర్నమెంట్ ఇమార్కెట్ ప్లేస్(జీఈఎం), ప్రత్యక్ష నగదు బదిలీ కార్యక్రమాలను సాంకేతికత ఆధారిత సంస్కరణలకు ఉదాహరణలుగా పేర్కొన్నారు. పన్నుల విధింపు, ఇతర ప్రభుత్వ ప్రక్రియల్లో ముఖ రహిత, కాగిత రహిత విధానాలు, సాంకేతికతతో కూడిన నిఘా, డేటా ఆధారిత పర్యవేక్షణ, బలమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను కూడా ఆమె ప్రస్తావించారు.

**నైతిక పరిపాలనపై సమాంతర కార్యక్రమం**

విస్తరించదగిన విజిలెన్స్ పద్ధతులు, సాంకేతికత ఆధారిత పరిష్కారాలు, నివారణాత్మక పర్యవేక్షణా విధానాలపై సభ్యులు తమ అనుభవాలను పరస్పరం పంచుకోవడానికి ఒక చక్కటి అవకాశాన్ని అందిస్తుందని రచనా షా తెలిపారు. అవినీతికి పాల్పడి పరారైన నేరస్థుల అన్వేషణ, నేరస్థుల అప్పగింతకు మద్దతు ఇచ్చే అనధికారిక సహకారంపై బ్రిక్స్ రిపాజిటరీ, బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్, బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ రెండో సెషన్‌లో చర్చలు జరగనున్నాయి. 'నవకల్పనలు, సాంకేతికత ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పాలన'పై ఒక సమాంతర కార్యక్రమం, 'ఆర్థిక సాంకేతికత(ఫిన్‌టెక్), వర్చువల్ డిజిటల్ అసెట్స్ (వీడీఏలు) నుంచి ఎదురవుతున్న అభివృద్ధి చెందుతున్న ముప్పులు, అవినీతి ద్వారా వచ్చిన సొమ్మును దాచడంలో, లాండరింగ్ చేయడంలో వాటి దుర్వినియోగాన్ని అరికట్టడంపై ప్రత్యేక సెషన్ ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నాయి. ప్రారంభోత్సవంలో బ్రిక్స్ ఏసీడబ్ల్యూజీ చైర్మన్ జె.అశోక్ కుమార్ ప్రతినిధి బృందాలకు స్వాగతం పలికారు. వారి నిరంతర భాగస్వామ్యానికి, నిర్మాణాత్మక సహకారానికి, పరస్పర సహకార స్ఫూర్తికి ధన్యవాదాలు తెలిపారు. గత కొన్ని నెలల్లో సాధించిన పురోగతి, నిరంతర చర్చల విలువ అవినీతి నిరోధక సహకారాన్ని బలోపేతం చేయడానికి బ్రిక్స్ దేశాల మధ్య ఉన్న ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారం బలోపేతానికి ఆచరణాత్మక సాధనాలు, విధానాలను అభివృద్ధి చేయడంపై ఏసీడబ్ల్యూజీ దృష్టి సారించిందన్నారు.

# దేశానికే ఆదర్శంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్

- **నిర్మాణ పనులు వేగవంతం చేయాలి**
- **విలువలతో కూడిన విద్యకు పెద్ద పీట**
- **బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలి**
- **డీజీపీ ఆనంద్**



హైదరాబాద్, ఆగస్టు 4:

ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) దేశానికే ఆదర్శ విద్యాసంస్థగా ఎదగాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఆకాంక్షించారు. మంచిరేవులలో నిర్మాణంలో ఉన్న పాఠశాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన స్కూల్ సొసైటీ కమిటీ సమావేశంలో ఐపీఎస్ అధికారుల సతీమణుల సంఘం(ఐపీఎస్ ఓడబ్ల్యు) అధ్యక్షురాలు లలితా ఆనంద్, కమిటీ సభ్యులతో కలిసి నిర్మాణ పురోగతి, విద్యా ప్రణాళికలు, మౌలిక సదుపాయాలను సమీక్షించారు. పోలీసు పిల్లల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ పాఠశాల అభివృద్ధికి ఐపీఎస్ అధికారుల సతీమణుల సంఘం కూడా తమ వంతు సహకారం అందించాలని నిర్ణయించింది. సమావేశానికి ముందు డీజీపీ విద్యార్థులతో మమేకమై ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం విలు విద్య, ఫెన్సింగ్ తదితర క్రీడల ప్రదర్శనలను వీక్షించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. పోలీసు సిబ్బంది పిల్లలు, అమర పోలీసుల కుటుంబాల పిల్లలు, సాధారణ ప్రజల పిల్లలకు ప్రపంచ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందని డీజీపీ తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యత వంటి అంశాలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం వంటి దుష్ప్రవర్తనలు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలలో విలువల ఆధారిత విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమాజం, దేశం పట్ల బాధ్యతతో కూడిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే కేంద్రంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిలవాలని ఆకాంక్షించారు. సమీక్షలో పాఠశాల భవనాల నిర్మాణ పురోగతి, విద్యా విధానం, పాఠ్య ప్రణాళిక, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. పెండింగ్ ప్రతిపాదనలు, బిల్లులు, అభివృద్ధి పనులను పరిశీలించి అవసరమైన ఆమోదాలు మంజూరు చేశారు. సీనియర్ పోలీసు అధికారులు తరచూ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, దేశభక్తి, ప్రజాసేవపై మార్గదర్శనం చేయాలని డీజీపీ సూచించారు. గత ఏడాది 125 మంది విద్యార్థులతో ప్రారంభమైన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో ప్రస్తుతం 2026-27 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి వరకు మొత్తం 345 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ సమావేశంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, డీజీ (ఆక్టోపస్) డా. అనిల్ కుమార్, ఐజీ (ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్) గజారావు భూపాల్, సైబరాబాద్ సిపి రమేష్, ఐజీ (వెల్ఫేర్) ఉదయ్ కుమార్ రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ కుమార్, ప్రిన్సిపాల్ అనిత, వ్యవస్థాపకుడు విశాల్, పాఠశాల సిబ్బంది తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌కు మెడికల్ హబ్ హోదా

- **రాష్ట్రంలో రెండో అతిపెద్ద వైద్య కేంద్రంగా అభివృద్ధికి కార్యాచరణ**
- **ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై మంత్రుల సమీక్ష**

హైదరాబాద్, ఆగస్టు 4:

వరంగల్‌ను తెలంగాణలోనే రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, వైద్య సేవలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్య సంస్థల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంజీఎం ఆసుపత్రి, సీకేఎం ఆసుపత్రి, కాకతీయ వైద్య కళాశాల, నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి తదితర సంస్థల అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, సిబ్బంది భర్తీ, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు వంటి అంశాలపై సమీక్షించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యవసర విభాగం, డయాలసిస్, క్యాథ్‌ల్యాబ్, ఆక్సిజన్ సదుపాయాలు, ఆధునిక పరికరాల ఏర్పాటు, అవసరమైన వైద్య సిబ్బంది నియామకాన్ని వేగవంతం చేయాలని మంత్రులు సూచించారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎంజీఎం ఆసుపత్రిలో పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, పాత భవనాల మరమ్మతులు, విద్యుత్, ప్లంబింగ్, భద్రతా వ్యవస్థల బలోపేతంతో పాటు ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి కొండా సురేఖ కోరారు.

# ఉచిత చేప పిల్లల పంపిణీ కొనసాగిస్తాం

- **పెండింగ్ బకాయిల చెల్లింపునకు కృషి**
- **విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపలుపై ఆలోచన**
- **ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఆన్‌లైన్ ద్వారా చేపల పంపిణీ**
- **రూ.కోటి 34 లక్షల బీమా క్లియర్ చేశాం**
- **పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి**



హైదరాబాద్, ఆగస్టు 4:

రాష్ట్రంలోని 26 వేల చెరువులు, వంద రిజర్వాయర్లలో చేపల పెంపకాన్ని విస్తరించడంతోపాటు మత్స్యకారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం, మత్స్యరంగ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సహకార సంఘాల బలోపేతం లక్ష్యంగా జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులకు బీమా, మోపెడ్‌లు, రిటైల్ అవుట్‌లెట్ షాపుల ఏర్పాటు కోసం ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలపై సమీక్షిస్తామని వెల్లడించారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించడంతోపాటు మత్స్యకారులకు సంబంధించిన పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల పోషకాహారాన్ని మెరుగుపరిచే దిశగా మధ్యాహ్న భోజన పథకంలో చేపలను చేర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు నెలకొన్న సహకార సంఘాల సభ్యత్వ వివాదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ కోహెడలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ ద్వారా చేపల విక్రయాలు, పంపిణీకి అవకాశం ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు. మత్స్యకారులకు సంబంధించిన రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని తెలిపారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులకు ప్రొటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.



## 15లోగా 13,046 పంట కుంటలు పూర్తి చేయాలి

- **గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి**

హైదరాబాద్, ఆగస్టు 4:

రాష్ట్రవ్యాప్తంగా 13,046 వ్యవసాయ కుంటల నిర్మాణాన్ని ఈనెల 15లోగా పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్ అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు(డీఆర్‌డీఓలు), జిల్లా పంచాయతీ అధికారులు(డీపీవోలు), జడ్పీ సీఈఓలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. వీబీజీ రామ్‌జీ, తెలంగాణ జలసిరి, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీఎస్‌ఏపీ) అమలుపై సమీక్షిస్తూ ప్రతి గ్రామ పంచాయతీలో వ్యవసాయ కుంటల గుర్తింపు, పరిపాలనా అనుమతులు, పనుల ప్రారంభాన్ని వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో కనీసం 50 ఎకో ఫార్మ్ పాండ్లను సెర్ప్‌ఎన్‌ఆర్‌ఎల్‌ఎం, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్యశాఖల సమన్వయంతో చేపట్టాలని సూచించారు. తెలంగాణ జలసిరి కింద వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంతలు, పర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, బహిరంగ బావుల అభివృద్ధి వంటి నీటి సంరక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ తనిఖీలు నిర్వహిస్తూ మండలస్థాయి అధికారులతో నిరంతరం సమీక్షలు చేపట్టి లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే జీపీఎస్‌ఏపీ)మాన్యువల్ తయారీని పూర్తి చేసి ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి మూడేళ్ల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్యతోపాటు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## ఫుడ్ పాయిజన్‌పై టీజీహెచ్ఆర్‌సీ సుమోటోగా కేసు

హైదరాబాద్, ఆగస్టు 4 :

ఎస్టీ బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్(టీజీహెచ్ఆర్‌సీ) సుమోటోగా కేసు నమోదు చేసింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ఎస్టీ బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం వల్ల 27మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు ఓ పత్రికలో మంగళవారం వార్త ప్రచురితం కావడంపై చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలోని మానవ హక్కుల కమిషన్ స్వయంచాలకంగా (సుమోటోగా) కేసు నమోదు చేసింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, అస్వస్థతకు గురైన విద్యార్థినుల సంఖ్య, వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వారికి అందించిన వైద్య చికిత్స, వసతి గృహంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, పారిశుధ్యంపై నిర్వహించిన విచారణ ఫలితాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకున్న నివారణ, సరిదిద్దే చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. సెప్టెంబర్ 7వ తేదీలోగా విచారణ నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ కేసును వాయిదా వేసింది.

## మండల కేంద్రాల్లో ప్రజావాణి

- **ప్రతి సోమవారం మండల కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ**
- **ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం**
- **మండల స్థాయి అధికారులందరికీ తప్పనిసరి హాజరు**
- **స్థానికంగానే సమస్యల పరిష్కారానికి చర్యలు**
- **ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**



హైదరాబాద్, ఆగస్టు 4:

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాష్ట్రంలోని అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను మండల స్థాయిలోనే స్వీకరించి వేగంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. ఇందుకోసం తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి, వ్యవసాయ అధికారి, విద్యాశాఖ అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి, శిశు అభివృద్ధి అధికారి, సంక్షేమ శాఖ అధికారులు, విద్యుత్, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, రహదారులుభవనాలు, అటవీ శాఖలతో పాటు దాదాపు 23 శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది.

ఇప్పటివరకు భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, మౌలిక వసతులకు సంబంధించిన ఫిర్యాదుల కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. కొత్త నిర్ణయంతో గ్రామీణ ప్రజలకు మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి అవకాశం లభించనుంది. దీంతో ప్రయాణ భారం, సమయం, ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నమోదు చేసి, వాటి పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక నమోదు విధానం అమలు చేయనున్నారు. నిర్ణీత గడువులో ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

## కల్వచర్ల గ్రామానికి చెందిన మైలగాని కిరణ్ కుటుంబానికి 60000 ఆర్థిక సహాయం



**డిడి9వార్త / పెద్దపల్లి ఆగష్టు 5:**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన మైలగాని కిరణ్ గత నెల 19వ తారీకు ఆదివారం రోజున రోడ్డు ప్రమాదంలో మరణించారు కిరణ్ కు భార్య ఇద్దరు కూతుర్లు కావున వారి యొక్క మిత్రుడు ఇసంపెల్లి కుమార్ గోదావరిఖని సోషల్ మీడియా ద్వారా వాట్సాప్ ద్వారా అందర్నీ సహాయం కోరగా వారి వారి పెద్ద మనసుతో ఎంతో కొంత సాయం చేయగా 50 వేల రూపాయలు అందజేశారు తన వంతు సాయంగా తన మిత్రుడు 10000 రూపాయలు ఇవ్వగ మొత్తం 60 వేల రూపాయలు కిరణ్ కుటుంబానికి పెద్ద కుమార్తె మైలగని సాన్విక పేరు మీద 60 వేల రూపాయలు పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేశారు. కిరణ్ కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమానికి గంట వెంకటరమణారెడ్డి సింగరేణి కుమార్ , మేకల మారుతి , కొప్పుల రాము, కొట్టే శ్యామ్, వారి స్నేహితులు నాయకులు కుటుంబ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ మంద సత్యానందంకు ఘన నివాళులు

### నివాళులు అర్పించిన మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ, సర్పంచ్ జ్యోతి

**బోనకల్,ఆగస్టు 4,(డీడీ9 వార్త):**





ప్రముఖ యువ విలేఖరి,సీపీఎం పార్టీ నాయకుడు మంద సత్యానందం ఆకస్మిక మరణం పట్ల మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ,బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.బోనకల్ మండలం గోవిందాపురం గ్రామంలో ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బానోతు కొండ మాట్లాడుతూ, మంద సత్యానందం సమాజ సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజల గొంతుకగా నిలిచిన నిబద్ధత కలిగిన విలేఖరి, ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన మరణం జర్నలిస్టు రంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. మంద సత్యానందం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తన్నీరు పుల్లారావు, ఆ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మూగబోయిన కలం..

- **రోడ్డు ప్రమాదంలో విజన్ ఆంధ్ర విలేఖరి సత్యానందం మృతి**
- **కడసారి కన్నీటితో మిత్రునికి వీడ్కోలు పలికిన జర్నలిస్టులు**



**బోనకల్,ఆగస్టు 04,(డీడీ9 వార్త):**

ఆ కలం ఆగిపోయింది...సుమారు పది సంవత్సరాల సుదీర్ఘ పాత్రికేయ ప్రస్థానం ముగిసి పోయింది..మండలానికి చెందిన ప్రముఖ పాత్రికేయుడు,గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన మందా సత్యనందం(36) విజన్ ఆంధ్ర' విలేకరిగా విధులు నిర్వహిస్తు సోమవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో కన్నుమూశారు.మండల కేంద్రంలోని రావినూతల వైపు ఆర్ఓబి బ్రిడ్జి ముందు భాగంలో జరిగిన బైక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి విధితమే.సత్యనందం మృతితో పాత్రికేయులతో పాటు,రాజకీయ నాయకులు,అభిమానుల్లో విషాదం నింపింది.నిన్నటి వరకూ సన్నిహితులతో సరదాగా మాట్లాడిన ఆయన ఆకస్మిక మరణాన్ని పాత్రికేయులు నమ్మలేకున్నారు.మంగళవారం మధ్యాహ్నం ప్రముఖులు,జర్నలిస్టులు అశ్రునయనాల మధ్య అంత్య క్రియలు జరిగాయి,సత్యానందం మృతదేహానికి జర్నలిస్టులు కన్నీటి వీడ్కోలు పలికారు, సత్యానందం కు తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేగల వేలాద్రి కన్నీటి పర్యంతమయ్యారు.తమ మిత్రుడు మా నుంచి దూరం ఐనా,తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు,సత్యానందం మృతదేహానికి నివాళులర్పించిన వారిలో సీనియర్ జర్నలిస్ట్ తేనె వెంకటేశ్వర్లు,యార్లగడ్డ శ్రీనివాసరావు,రేగళ్ల శ్రీనివాసరావు,భుక్యా శ్రీనివాసరావు,యార్లగడ్డ శ్రీనివాసరావు,షేక్ బడే సాహెబ్,షేక్ పెంటు సాహెబ్,యంగల గౌతం,షేక్ మదర్ సాహెబ్,షేక్ బాజీ షరీఫ్,నాగటి రాజశేఖర్,తగరం రమేష్,మంద అశోక్ , స్నేహితులు ఉన్నారు.

## ఆగస్టు 6 విద్యార్థుల మహా ధర్నాను విజయవంతం చేయాలి

- **ఎస్ఎఫ్ఐ పిలుపు**
- **విద్యార్థుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్య పరిరక్షణే ధ్యేయం**
- **షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సమావేశం**
- **భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని వడ్ల శ్రీకాంత్ పిలుపు**




**షాద్ నగర్ 04 ఆగస్ట్ ( డిడి 9 వార్త ప్రతినిధి ):**

విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యంగా ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద నిర్వహించనున్న 'ఛలో హైదరాబాద్' విద్యార్థుల మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ పోరాటంలో ప్రతి విద్యార్థి బాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని శ్రీకాంత్ కోరారు. షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాల కళాశాలల విద్యార్థులు కూడా భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రాంచరణ్, తరుణ్, రాజేష్, శ్రీనేతన్ తదితరులు పాల్గొన్నారు..

## మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్న రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క







- **గుడి ప్రాంగణంలో ఉన్న పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు**

**తాడ్వాయి డిడి9 వార్త**

రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క ఆదివాసి సంప్రదాయాల ప్రకారంగా డోలు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికిన సమ్మక్క – సారలమ్మ పూజారులు , దేవాదాయ శాఖ అధికారులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడారంలో బొజ్జ సంధ్య రెడ్డి ఆద్వర్యంలో మదర్ ఎడ్యుకేషనల్ & రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ద్వారా మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్కనిరుద్యోగ మహిళలకు , గ్రామీణ యువతకు స్వయం ఉపాధి హామీ తాడ్వాయి మండలం , మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల సన్నిధిలో సమ్మక్క తల్లి భవనంలో మహిళలకు మదర్ & ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్ మెంట్ ఫౌండేషన్ సొసైటీ వ్యవస్థాపకులు బొజ్జ సంధ్యా రెడ్డి , స్థానిక సర్పంచ్ పీరీల భారతి –వెంకన్న ఆద్వర్యంలో కుట్టుమిషన్ల ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించిన రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క మాట్లాడుతూ 45 రోజుల ఈశిక్షణ పూర్తి చేసిన ప్రతీ ఒక్కరికీ సర్టిఫికెట్ అందజేస్తారని అన్నారు మహిళలు నైపుణ్యం సాధించి ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని కొనియాడారు మేడారం మరియు చుట్టుపక్కల గ్రామాల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించాం అని అన్నారు , మహిళలు ప్రతీ ఒక్కరు మహిళా సంఘాలలో చేరాలని కోరారు ఈకార్య క్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు , ములుగు జిల్లా సీనియర్ నాయకులు ఎర్రబెల్లి మనోజ్ కుమార్ , స్థానిక సర్పంచ్ పీరీల భారతి – వెంకన్న , తాడ్వాయి మండల అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి , మాజీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ముదిరాజ్ , ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ మట్టేవాడ తిరుపతి , మండల ఉపాధ్యక్షులు ఇప్ప నాగేశ్వర రావు , వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్ర కోల తిరుపతి , సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్ , మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అరెమ్ లచ్చు పటేల్ , జిల్లా ప్రధాన కార్యదర్శి జాలపు అనంత రెడ్డి , జిల్లా కార్యదర్శి ఇర్ప సునీల్ , మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు గౌడ్ , సహకార సంఘం మాజీ చైర్మన్ పాక సాంబయ్య , మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు గొంది సరిత , సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గడ్డం నాగ భూషణం , సర్పంచులు మంకిడి శ్రీలత – ప్రశాంత్ , తోలెం కృష్ణ , యాప కళా మోహన్ రావు , ఉపసర్పంచులు ఆలకుంట వనిత – కృష్ణ , కాక రంజిత్ , కట్కూరి భాస్కర్ రెడ్డి , మేడారం గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రానా రమేష్ , బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్ , ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మంకిడి ప్రశాంత్ , జిల్లా నాయకులు తాండాల శ్రీను , ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షులు వావిలాల రాంబాబు , మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దుబాసి సుధాకర్ , అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన బోజారావు , గ్రామ కమిటీ అధ్యక్షులు పాక రాజేందర్ , రాపోలు సంజీవ రెడ్డి , మండల నాయకులు మడకం శోభన్ , కల్వల సమ్మయ్య , ఆలేటి జైపాల్ రెడ్డి , అనుమాండ్ల రాజీ రెడ్డి , మొక్క దుర్గయ్య , యానాల సిద్ధి రెడ్డి , బొమ్మగాని గణేష్ , గండికోట నారాయణ , ఎనగంటి నరేష్ , పురుషోత్తం నరసింగరావు , పురుషోత్తం స్వామీ , ఎనగంటి సంజయ్ , ఎండీ ఆదిల్ , గండికోట సాగర్ , వార్డ్ మెంబర్ సభ్యులు , మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు , సీనియర్ నాయకులు , కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

- **తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు దుగ్గి చిరంజీవి.**

**తాడ్వాయి డిడి9 వార్త**



తాడ్వాయి మండలం బంజారా ఎల్లాపూర్ గ్రామంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు దుగ్గి చిరంజీవి మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆగస్టు 9 ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు హక్కుల పరిరక్షణ దినమని, ఆనాడు ఆదివాసి ఉద్యమకారులు పోరాడు సాధించుకున్న హక్కులు చట్టాలు ఈరోజు కాలరాయపడుతున్నాయని అదే విధంగా ఇప్పటికే జీవో నంబర్ త్రీ ని నిర్వీర్యం చేశారని అదేవిధంగా 1/70 చట్టాన్ని కూడా నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని పెసా చట్టానికి ఊపిరి అయినటువంటి గ్రామసభకు హక్కు లేకుండా చేశారని ఆయన మండిపడ్డారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి చట్టాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయని ఆదివాసులను చిన్నచూపు చూస్తున్నాయని ఆయన అన్నారు. 1/70 చట్టాన్ని రద్దు చేయాలని మరియు కొంతమేరకైనా మినహాయింపు కల్పించాలని 1700 మంది గిరిజనేతర్లు సుప్రీంకోర్టులో కేసు వేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లిఎడ్ కావలసిన బాధ్యత ఉన్నప్పటికీ ఏమాత్రం స్పందించకుండా నిమ్మకు నీరు ఎత్తనట్టుగా వైఖరిని కొనసాగిస్తూ ఉన్నది ఇప్పటికైనా ఆదివాసి ముద్దుబిడ్డ అయిన టువంటి మంత్రి సీతక్క గారు స్పందించి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ కావాలని కోరుతున్నాము. ఇప్పటికే ఆదివాసి చట్టాలు ఉన్నప్పటికీని ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతంలో వన్ ఆఫ్ చట్టానికి వ్యతిరేకంగా భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ఆదివాసి చట్టాలను ఏజెన్సీ ప్రాంతంలో పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రపంచ ఆదివాసి దినోత్స వానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత సంవత్సరం లాగానే అధికారికంగా నిధులు కేటాయించి దినోత్సవాన్ని ఈ ఆదివాసీల పండుగను జయప్రదం చేయాలని అన్నారు.ఆగస్టు 9 ఐటీడీఏ కేంద్రంగా జరుగు ఉత్సవాలని సంస్కృతి సాంప్రదా యాలతో కళానృత్యాలతో ప్రతి ఒక్క ఆదివాసి బిడ్డ ఏటూర్ నాగారం ఐటీడీఏ కేంద్రానికి హాజరై జయప్రదం చేయాలని అదేవిధంగా సంస్కృతి సాంప్రదాయాలను హక్కులను కాపాడుకునే విధంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ కార్యదర్శి నాలి కార్తీక్ అధ్యక్షులు ఈసం విజయ్ కుమార్ సభ్యులు నాలి దిలీప్ గుమ్మడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిఐను సన్మానించిన : మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్

- **గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి**
- **నూతన సీఐ నాగార్జున రెడ్డి సన్మానించిన సర్పంచులు బోకుల శ్రీరాములు,గోవింద్ నాయక్,కొర్ర శాంతి విష్ణు నాయక్**

**కొత్తూర్ ఆగస్టు 04 ( డిడి 9 వార్తా ప్రతినిధి ):**

గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. మంగళవారం కొత్తూరు నూతన సీఐ నాగార్జున రెడ్డిని సర్పంచులు బోకుల శ్రీరాములు,గోవింద్ నాయక్,కొర్ర శాంతి విష్ణు నాయక్ పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పోలీస్ శాఖకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని,యువత పెడదోవ పట్టకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని సిఐని కోరినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగారం సురేష్ గౌడ్,జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ ఉద్యోగాలలో ఆదివాసీలకు జరిగే అన్యాయం

- 75% వాటపై ప్రభుత్వంలో చర్చించి న్యాయం చేయాలని రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్కకి వినతి
- పోలీసు శాఖకు మావిన్నపం పరిగణలోకి తీసుకోక పోతే పోరాటం తప్పదు తుడుండెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా.అరుణ్ కుమార్ ASU రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి



**తాడ్వాయి డిడి9 వార్త**

మేడారంలో సమ్మక్క ఆది వాసి భవన్ యందు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్కకి పోలీసు రిక్రూట్మెంట్ లో 75% షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై వినతి పత్రం అందచేసి స్పష్టంగా వివరించడం జరిగింది. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు Rc No. 189/Rect./Rect.2/2026 లో పూర్తిగా భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ఉల్లంఘన జరిగింది తెలంగాణ స్టేట్ పోలీస్ డిపార్ట్ మెంట్ సర్వీస్ రూల్స్ గెజిట్ నోటిఫికేషన్ తేదీ:10/05/2018 లో పేజీ నెంబర్ 3, 2 క్లాసు (i) లో స్పష్టంగా షెడ్యూల్ ఏరియాకి 75% స్పష్టంగా పేర్కొన్నారు కానీ పోలీసు శాఖ తమ డిపార్ట్మెంట్ గెజిట్ ను కూడ పక్కన పెట్టింది అని అన్నారు. GO : Ms No 30 Tribal welfer dated:11/07/2019 ప్రకారం No 5 సీరియల్ నెంబర్ 9లో స్పష్టంగా పేర్కొన బడి ఉంది. GO No : 109 Dated 17/06/1988 ప్రకారం 75% షెడ్యూల్ ఏరియా అభ్యర్థులకు కేటాయించాల్సి ఉంది. GO 24 ప్రకారం ఐటిడిఎ లో డ్రిస్టిక్ లెవెల్ స్క్రూట్నీ కమిటీ (DLSC) ఏజెన్సీ సర్టిఫికెట్ విచారణ నిర్ధారణ అయిన తరువాతనే ఉద్యోగం ఇవ్వాలి కాని వీటి ప్రకారం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ లు మరియు 2015/2018 మరియు 2022లో కూడ ఈ నిబంధనల ప్రకారం ఇచ్చారు మాకు న్యాయం జరిగింది. కానీ పోలీస్ శాఖ జనరల్ జీవోల ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వటం వలన 5వ షెడ్యూల్ ప్రాంత ఏజెన్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిధులతో చర్చించి న్యాయం చేయాలని కోరటం జరిగింది ఈ కార్య కార్య క్రమంలో తుడుండెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా.అరుణ్ కుమార్ ASU రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వటం సుభద్ర ASU రాష్ట్ర కార్యదర్శి సిద్ధబోయిన కార్తీక్ గోంది రాకేష్ లు పాల్గొన్నారు

# PK OC-2 డీప్ సైడ్ గనిని సింగరేణికి దక్కించడంలో విశేష కృషి చేసిన ఎమ్మెల్యే పాయం...

- OC-2 పిట్ మీటింగ్‌లో కార్మికులతో కలిసి విజయోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే.

**మణుగూరు.ఆగస్టు 4 (డి డి 9వార్త)**




భద్రాద్రి జిల్లా, మణుగూరు సింగరేణి PK OC-2 డీప్ సైడ్ బొగ్గు గనిని సింగరేణి సంస్థకు కేటాయించడం ద్వారా వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతకు భరోసా కల్పించిన నేపథ్యంలో PK OC-2 ప్రాజెక్టులో నిర్వహించిన పిట్ మీటింగ్‌కు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి INTUC వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణంరాజు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, PK OC-2 డీప్ సైడ్ గనిని సింగరేణికి దక్కించేందుకు కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులతో కలిసి నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చేసిన కృషి ఫలించిందన్నారు. ఈ గని సింగరేణికి రావడం వల్ల సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రత, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్కకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి,తుమ్మల నాగేశ్వరరావు కు PK OC-2 డీప్ సైడ్ గనిని సింగరేణికి కేటాయించడంలో అందించిన సహకారానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, INTUC నాయకులు, సింగరేణి కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం సింగరేణి కార్మికులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను ఘనంగా సన్మానించి, సింగరేణి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, మణుగూరు ప్రాంత అభివృద్ధి కోసం ఆయన చేసిన విశేష కృషిని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కార్మికుల పక్షాన నిలిచి సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే పాయం కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు క్యాంటీన్‌లో కార్మికులతో కలిసి టిఫిన్ చేస్తూ ఆప్యాయంగా ముచ్చటించారు. కార్మికుల సమస్యలు, సంక్షేమం, పని పరిస్థితులపై వారిని అడిగి తెలుసుకుని, వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో INTUC నాయకులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద విద్యార్థి ఉన్నత విద్యకు చేయూత..

- భవిష్యత్తుకు బలమైన పునాది.
- "ఆదివాసీ విద్యానేస్తం" నుండి అభినందనలు తెలుపుతూ, ఆర్థిక సహాయం అందజేత.

**మణుగూరు.ఆగస్టు 4 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, జానంపేట సమీపంలోని అమరవరం గ్రామానికి చెందిన ప్రతిభావంతుడైన ఆదివాసి విద్యార్థి పూనెం రాకేష్ (శంకరయ్య – కమల దంపతుల కుమారుడు) ప్రతిష్ఠాత్మకమైన NIT జమ్షెడ్పూర్ (Jharkhand) లో M.Sc. కెమిస్ట్రీ కోర్సులో సీటు సాధించడం మనందరికీ గర్వకారణం.వీరిది నిరుపేద కుటుంబం కావడంతో,ఈ విద్యార్థి ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన "ఆదివాసి విద్యానేస్తం" తరపున, అతని ఉన్నత విద్యకు తోడ్పాటుగా రూ.10,000/- (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని వారి నివాసంలో అందజేయడం జరిగింది.ఈ సహాయ కార్యక్రమంలో పాల్గొన్న దాతలు:

దనసరి నరసింహ మూర్తి, (Advocate) కొమరం శ్రీను, బిజ్జా అనిల్, సుతారి కృష్ణ సాగర్, వజ్జ రమేష్. వీరి ఉదారత, విద్యార్థుల పట్ల ఉన్న సేవాభావం అభినందనీయం. వీరికి ఆదివాసి విద్యానేస్తం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది. "విద్యకు అందించిన ప్రతి చేయూత... ఒక కుటుంబానికే కాదు, సమాజానికే వెలుగునిస్తుంది." ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరింత మంది ముందుకు వచ్చి ప్రతిభావంతులైన ఆదివాసి విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని, సహాయం చేయదలచినవారు మీ చిరు సహాయాన్ని ఈ క్రింది నెంబర్ కు అందించాలని "ఆదివాసీ విద్యానేస్తం"ప్రతినిధులు కోరారు.

# మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు తుది దశకు

- బాహుబలి మోటార్ అమరికకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకారం..
- రైతులకు శాశ్వత సాగునీటి భరోసా... చివరి ఎకరం వరకు నీరందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే పాయం.



**మణుగూరు.ఆగస్టు 4 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలంలోని సీతారామపురం వద్ద నిర్మితమవుతున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రాజెక్టులో అత్యంత కీలకమైన బాహుబలి మోటార్ అమరిక పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తయిన అనంతరం ఈ ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించి అశ్వాపురం మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.రాజీవ్ సాగర్ ప్రాజెక్టు ప్రారంభ సమయంలో ఎమ్మెల్యేగా ఉండడం, నేడు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం తుది దశకు చేరుకున్న సందర్భంలో కూడా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.లెఫ్ట్ కెనాల్ ద్వారా ఆరు గ్రామ పంచాయతీల పరిధిలోని సుమారు 12 వేలకుపైగా ఎకరాలకు, రైట్ కెనాల్ ద్వారా 10 చెరువులను నింపి దాదాపు 30 వేల ఎకరాలకు చివరి ఎకరం వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ టి. వెంకటేశ్వరరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కె. శ్రీనివాస్, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఎంఈఐఎల్ సిబ్బంది, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, గాదె కేశవరెడ్డి, ఆవుల రవి, వేములపల్లి రమేష్, ఉసా అనిల్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భూరెడ్డి వెంకటరెడ్డి, తుక్కాని మధు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## చిన్నపాటి వర్షా నికే కాల్వ బజారు బురదమయం..!

### నడవాలంటే నరకయాతనే.. మా బజారును జర బాగు చేయండి సారూ..!

**మణుగూరు.ఆగస్టు 4 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండల కేంద్రంలోని కాల్వ బజారు చిన్నపాటి వర్షానికే పూర్తిగా బురదమయంగా మారి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్డంతా బురదతో నిండిపోవడంతో ప్రజలు నడవాలన్నా, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలన్నా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుండగా, వర్షం కురిసినప్పుడల్లా రహదారి చెరువును తలపించేలా మారుతోంది. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురద కారణంగా జారిపడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని, అత్యవసర సమయాల్లో కూడా ఈ మార్గంలో ప్రయాణించడం కష్టంగా మారిందని వారు వాపోతున్నారు. ఇక రాత్రి వేళల్లో ఎవరికైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వారి బాధలు వర్ణనాతీతం అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "చిన్న వర్షానికే ఇంత దుస్థితి ఉంటే భారీ వర్షాలు వస్తే మా పరిస్థితి ఏమిటి? అని, వెంటనే రహదారిని అభివృద్ధి చేసి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి" అని బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు పవన్ ,ఐలమల్లు, భద్రయ్య, ప్రవీణ్ తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తున్న ఉప సర్పంచ్ గాండ్ల సురేష్..



**మణుగూరు.ఆగస్టు 4 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం లోని సమితి సింగారం గ్రామ పంచాయతీ పరిధిలో.. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షం కారణంగా వరద ఉధృతికి ముంపుకు గురైన వివేకానంద నగర్, వినాయక నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ఇళ్లల్లోకి వచ్చిన వరద నీరును తక్షణమే స్పందించి తమ సిబ్బంది తో ఎక్కడికక్కడ కాలువలు తీపించి వరద నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేశారు. ఒకవైపు వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను గమనించి దగ్గరుండి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ మాట్లాడుతూ, రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలుపడంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని,ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. వరద నీటితో మంచినీటి బావులు సైతం కలుషితమవడంతో ప్రజలు కాచి చల్లార్చిన పరిశుభ్రమైన నీటిని వినియోగించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్,10వ వార్డు సభ్యుడు ఎస్కే రహీం పాషా, పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్, రామన్న మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వృత్తి వైద్యం..ప్రవృత్తి మానవత్వం



**చర్ల, ఆగస్టు 4( డిడి 9 వార్త )**

చర్ల మండలంలోని కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో క్షయ వ్యాధితో బాధపడుతున్న ఒక మహిళను దత్తత తీసుకొని మానవతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీధర్. ప్రధానమంత్రి మోదీ ప్రారంభించిన నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా చర్ల మండలంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన ఒక క్షయ (టీబీ)వ్యాధిగ్రస్తురాలిని ఆయన దత్తత తీసుకున్నారు. వైద్యం తీసుకునే ఆరు నెలలు ఆ బాధితురాలికి అవసరమైన పౌష్టికాహారాన్ని తాను స్వయంగా అందిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి ఉద్యోగి ఒక టీబీ పేషెంట్ ను దత్తత తీసుకోవాలని ఇచ్చిన పిలుపు తనను ఎంతగానో ప్రభావితం చేసిందన్నారు. మనం రోజూ ఎన్నో ఖర్చులు పెడుతుంటామని, ఒక టీబీ రోగికి పోషకాహారం కోసం పెట్టే ఖర్చు అందులో చాలా చిన్నదే అయినప్పటికీ దాని వల్ల వచ్చే సంతృప్తి మాటల్లో చెప్పలేనిదన్నారు. టీబీ పేషెంట్లలో చాలా మంది పేదరికం కారణంగా సరైన ఆహారం తీసుకోలేకపోతున్నారని పని చేసుకోవడానికి కూడా వారికి శక్తి ఉండదని వారికి నయం కావాలంటే మందులతో పాటు సరైన బలవర్ధకమైన ఆహారం కూడా తప్పనిసరి అనన్నారు. అందరూ ముందుకు వచ్చి క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని పోషకాహారం అందిస్తే అతి త్వరలోనే మన దేశం నుండి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. ఆయన తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యలపై దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపు..

### క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమం. -CITU, AIAWU, AIKS



**మణుగూరు.ఆగస్టు 4 (డి డి 9వార్త)**

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సమర శంఖం పూరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న పిలుపునిచ్చారు. ఆగస్టు పదిన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జైలు బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు శుక్రవారం మండల కేంద్రంలో సిఐటియు, రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల సదస్సు రైతు సంఘం నాయకులు పద్దం గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నిమ్మల వెంకన్న మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ప్రజా సంపదను ప్రైవేటీకరిస్తుందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించడం ద్వారా ఎనిమిది గంటల పని హక్కు, ఉద్యోగ భద్రత, కనీస వేతన హక్కు, కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కులను బలహీనపరిచిందని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) కల్పించాలని దేశవ్యాప్తంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అమెరికాలో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ రైతాంగం నష్టపోతుందని పేర్కొన్నారు. పత్తి, మొక్కజొన్న, పాల ఉత్పత్తులు, కోడి కాళ్ళ దిగుమతులకు సంబంధించిన ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీన పరుస్తూ గ్రామీణ పేదల జీవనోపాధిపై కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజిరాంజీ చట్టం, నూతన విత్తన చట్టం, నూతన విద్యుత్ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాల వల్ల రైతులు కార్మికులు, సామాన్య ప్రజలపై అదనపు భారాలు పడతాయని అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించే జైలు బరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ కొమరం కాంతారావు, మాదాసు అఖిల్, పద్దం గణేష్, మధ్యాహ్న భోజన కార్మికులు లలిత, సావిత్రి, రమేష్,కణీతి రాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ టీఆర్పీ ఇన్ చార్జిగా డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతికి ఘన సన్మానం

**జనగామ ఆగస్ట్ 4(డిడి 9వార్త)బ్యూరో**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జిగా, ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ సైనికుడు డాక్టర్ కర్నల్ మాచర్ల బిక్షపతిని ప్రకటించిన సందర్భంగా పలువురు పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం ముదిరాజ్, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మన్నే సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మారబోయిన కనకయ్య, వంగాల చంద్రయ్య, కూరాకుల ఎల్లయ్య తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. బిక్షపతి నాయకత్వంలో జనగామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇబ్రహీంపూర్ గ్రామసభలో అభివృద్ధి పనులపై సమీక్ష



**జనగామ ఆగస్టు 4(Dd9 వార్త)బ్యూరో**



రఘునాథపల్లి మండలం పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామ సర్పంచ్ పోకల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో సీసీ కెమెరాల ఏర్పాటు, సీసీ రోడ్లు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, తడి–పొడి చెత్త నిర్వహణ తదితర అభివృద్ధి అంశాలపై చర్చించారు. గ్రామస్థుల సూచనలు స్వీకరించారు. అనంతరం లక్ష్మీ తండాలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించి, నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు ఉపసర్పంచ్ చింత నరేష్ మరియు గ్రామ వార్డు సభ్యులు అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## తోషం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

**డిడి9 వార్త గుడిహత్నూర్ :**

జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజా సంబంధాల అధికారి ఆదేశాల మేరకు గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామంలో సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి ఆదిలాబాద్ బృందం కళాజాత రూపంలో ప్రజలకు వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, దోమల నివారణ, సురక్షితమైన తాగునీటి వినియోగంపై సందేశాలు అందించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆదిలాబాద్ బృందం కళాకారులు ఆత్రం గోవింద్ రావు చాకటి రవీందర్ గట్టు వెంకట్రావు కె. నగేష్ ఎం. మామిడిపల్లి రాజలింగు జి. ఆశిష్ మెస్రం మురళి వై. నర్సమ్మ నరేష్ గ్రామస్థులు పాల్గొన్నారు

# అశ్రునయనాల మధ్య జర్నలిస్ట్ సత్యానందం

# అంత్యక్రియలు,అంతిమయాత్ర





- **భారీగా తరలిన సిపిఎం శ్రేణులు,బంధువులు, జర్నలిస్టులు,మిత్రులు**
- **కన్నీటీ పర్యాంతమైన జర్నలిస్టు మిత్రులు**
- **శోకసముద్రంలో గోవిందాపురం ఎల్ గ్రామం**

**బోనకల్,ఆగస్టు 04,(డీడీ9 వార్త):**

మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన సిపిఎం సభ్యుడు,విజన్ ఆంధ్ర దినపత్రిక రిపోర్టర్ మంద సత్యానందం (36) మృతదేహానికి సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.మంద సత్యానందం సోమవారం రాత్రి మండల కేంద్రంలోని రావినూతల వైపు ఆర్ఓబి బ్రిడ్జి ముందు భాగంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి విదితమే. మృతదేహాన్ని రాత్రి పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని గోవిందాపురం ఎల్ తరలించారు. మృతదేహాన్ని చూసేందుకు బంధువులు, మిత్రులు, జర్నలిస్టులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.గోవిందాపురం ఎల్ నుంచి సిపిఎం శ్రేణులు భారీగా కదిలి వచ్చారు.మృతదేహాన్ని చూసి ప్రతి ఒక్కరూ కన్నీరు పర్వంతం అయ్యారు.సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలోనే అంత్యక్రియలు నిర్వహించారు.ఈ సందర్భంగా సత్యానందం మృతదేహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ఉంచి ఊరేగింపుగా దహన సంస్కారాలు నిర్వహించే స్మశాన వాటిక వరకు తీసుకెళ్లారు. ఈ అంత్యక్రియలలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు,సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు చింతలచెరువు కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ఉన్నారు. సత్యానందం మృతదేహాన్ని చూసేందుకు ప్రధానంగా మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మృతదేహాన్ని చూసిన ప్రతి మహిళ కన్నీరు పర్యంతం అయింది. భర్త మృతదేహాన్ని చూసిన భార్య సుమ వెంటనే గుండెలను బాదుకుంటూ కన్నీరు పర్యంతం అయింది. భర్త మృతదేహంపై పడి రోధిస్తున్న తీరు చూసి ప్రతి ఒక్కరు కన్నీరు పర్యంతం అయ్యారు. అదేవిధంగా సత్యానందం అత్త కూడా అల్లుడు మృతి చెందడంపై రోదిస్తున్న తీరును చూసి ప్రతి ఒక్కరు కూడా కన్నీరు పెట్టుకున్నారు.అంత్యక్రియలకు భారీగా మండలం నుంచి సిపిఎం శ్రేణులు బంధువులు కుటుంబ సభ్యులు మిత్రులు జర్నలిస్టులు హాజరయ్యారు.

**పోతినేని, నున్నా సంతాపం:**

మంద సత్యానందమూర్తి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు తీవ్ర సంతాపం తెలిపారు. మృతిని కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతి తెలిపారు.

**సిపిఎం నాయకులు నివాళులు:**

గోవిందాపూర్ ఎల్ గ్రామంలో మంద సత్యానందం మృతదేహానికి లక్ష్మీపురం మాజీ సర్పంచ్ సిపిఎం సీనియర్ నాయకులు మాదినేని నారాయణ సిపిఎం జండా కప్పి నివాళులర్పించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏడు నూతల శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు జిల్లా సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, ఐద్వా మధిర డివిజన్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ సునీత, సిపిఎం శాఖా కార్యదర్శులు తమ్మారపు లక్ష్మణరావు, నల్లబోతు వాణి, నాయకులు ఏడునూతల లక్ష్మణరావు, కళ్యాణపు శ్రీనివాసరావు, కొమ్ము శ్రీనివాసరావు, వల్లంకొండ సురేష్, గ్రామ సర్పంచ్ మంద కరుణ, నల్లమోతు నాగేశ్వరరావు, యేసుపోగు బాబు, పుచ్చకాయల వలరాజు, రామాపురం మాజీ సర్పంచ్ కొండ నాగేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు కొమ్మినేని నాగేశ్వరరావు, కళ్యాణపు కిరణ్ కుమార్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు లు నివాళులర్పించారు.

**టిడబ్ల్యూజేఎఫ్ నాయకుల నివాళులు:**

మంద సత్యానందం మృతదేహానికి టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు నివాళులర్పించారు.టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా కార్యదర్శి పల్లా కొండలరావు, షేక్ అర్షద్ ఖాన్,ఇంటి ప్రసాద్, నవతెలంగాణ సర్కులేషన్ జిల్లా ఇన్చార్జి ఇరుగు వెంకటేశ్వర్లు, తదితరులు నివాళులర్పించారు.

**నివాళులు అర్పించిన బోనకల్ జర్నలిస్టులు:**

సత్యానందం మృతదేహానికి బోనకల్ జర్నలిస్టులు నివాళులర్పించారు.యార్లగడ్డ శ్రీనివాసరావు,రేగళ్ల శ్రీనివాసరావు,భుక్యా శ్రీనివాస రావు, యార ్లగ డ శ్రీనివాసరావు,దేగల వేలాద్రి,షేక్ బడే సాహెబ్,షేక్ పెంటు సాహెబ్,యంగల గౌతం,షేక్ మదర్ సాహెబ్, షేక్ బాజీ షరీఫ్,తగరం రమేష్,మంద అశోక్,ఇరుగు పుల్లారావు,చింతకాని జర్నలిస్టులు పెరిక నాగేశ్వరరావు,తూము నరసింహారావు తదితరులు నివాళులు అర్పించారు.

**సిపిఐ, బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు నివాళులు:**

సత్యానందం మృతదేహానికి బోనకల్, చొప్పకట్లపాలెం సర్పంచులు జ్యోతి కాటేపల్లి అశ్విని చంద్రశేఖర్ బోనకల్ ఉపసర్పంచ్ బానోతు కొండ, అపార్టీ నాయకులు గద్దల వెంకటేశ్వర్లు, ఎంగల కనకయ్య, బెజవాడ మల్లికార్జునరావు, సిహెచ్ ప్రసాద్ రావు, కాటేపల్లి చంద్రశేఖర్ తదితరులు నివాళులు అర్పించారు. సత్యానందం మృతదేహానికి సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రామారావు,నాయకులు ఆకెన పవన్ నివాళులు అర్పించారు.

## భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

- **పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్**

**భద్రాచలం, ఆగస్టు 4 (డిడి9 వార్త):**



వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆయన ఆలయంలో కొనసాగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్తర ద్వార దర్శనం నిర్మాణ పనులను ముక్కోటి ఏకాదశి నాటికి పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆలయం చుట్టూ తూర్పు, దక్షిణ, పడమర వైపులా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్, ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా నిర్మాణాలు చేపట్టాలని, ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం నుంచి గోదావరి ఘాట్ వరకు కాలినడకన పరిశీలించిన కలెక్టర్.. రోడ్డు విస్తరణ, పాదచారుల మార్గాలు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వెలుగులు, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, సూచిక బోర్డులు తదితర మౌలిక వసతులను పుష్కరాలకు ముందే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చిత్రకూట మండపం వద్ద కొనసాగుతున్న తొలగింపు పనులను పరిశీలించిన ఆయన, పురాతన రాతి స్తంభాలు, శిల్ప సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో పనులు చేపట్టాలని సూచించారు. వారసత్వ సంపద పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం ఆలయాన్ని దర్శించిన కలెక్టర్‌కు అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధిని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఈ పనులను, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పనుల్లో జాప్యం లేకుండా ప్రత్యేక అధికారిని నియమించి వేగవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ రవికుమార్, ఆర్అండ్‌బి శాఖ ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, రోడ్లు & భవనాల శాఖ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

- **ఆర్ ఎమ్ పి లు పరిధి కి మించి వైద్యం చేస్తే కఠినచర్యలు..**
- **జిల్లా వైద్య శాఖ అధికారి (DMHO) డా.తుకారాం రాథోడ్.**

**మణుగూరు. ఆగస్టు 4 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ మంగళవారం నాడు జిల్లా లోని మణుగూరు,కరకగూడెం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మణుగూరు లోని మోడల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆశా డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,వ్యక్తిగత పరిశుభ్రత,పౌష్టికాహార ప్రాముఖ్యత మరియు స్త్రీలలో రక్త హీనత నిర్మూలన తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.అనంతరం కరకగూడెం మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసుపత్రి అంతా కలియ తిరుగుతూ రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్ ను,మందుల గదిని, డెలివరీ రూమ్ ను క్షుణ్ణంగా పరిశీలించి,రికార్డులను తనిఖీ చేశారు.అనంతరం మాట్లాడుతూ, వర్షాలు బాగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆశా వర్కర్లు తమ గ్రామాల పరిధిలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని, వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని అన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,గ్రామాలలో ఆర్ఎంపి లు, పిఎంపి లు వారి



పరిధికి మించి వైద్యం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. శాఖా పరమైన చర్యలతో పాటు వారి క్లినిక్ లను కూడా సీజ్ చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రతాప్, వైద్య ఆరోగ్య సిబ్బంది నాగభూషణం,రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల నాటి హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

- సమర్థవంతమైన దర్యాప్తుతో నేరం రుజువు చేసిన బీర్కూర్ పోలీసులు



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 04(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించింది.ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా కూడా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.బరంగేడ్గి గ్రామానికి చెందిన వడ్ల మారుతి హత్యకు గురైన ఘటనపై ఆయన కుమారుడు వడ్ల రాజ్‌కుమార్ 2018 సెప్టెంబర్ 2న బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో కుటుంబ సభ్యుల మధ్య పదేళ్లుగా కొనసాగుతున్న ఆస్తి, భూమి వివాదాలే హత్యకు కారణమని పోలీసులు గుర్తించారు.పోలీసుల వివరాల ప్రకారం, మృతుడు వడ్ల మారుతిని ఆయన సోదరుడు వడ్ల సాయిలు మృదంగం మరమ్మతుల పేరుతో ఇంటికి పిలిపించాడు.అక్కడ తన కుమారుడు వడ్ల గజానంద్‌తో కలిసి వడ్రంగి బాడిషతో తలపై దాడి చేయడంతో మారుతి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.దర్యాప్తు అధికారులు సాక్షుల వాంగ్మూలాలు, శాస్త్రీయ ఆధారాలు, ఇతర సాక్ష్యాలను సేకరించి నిందితులు వడ్ల గజానంద్ (ఏ1), వడ్ల సాయిలు (ఏ2)పై అభియోగపత్రం దాఖలు చేశారు.విచారణ అనంతరం జిల్లా న్యాయమూర్తి పి. ముక్తిద నిందితులపై నేరం రుజువైందని నిర్ధారించి ఇద్దరికీ జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా విధించారు.ఈ కేసులో ప్రభుత్వ తరఫున సమర్థవంతంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్య ప్రసాద్, దర్యాప్తు నిర్వహించిన అప్పటి బీర్కూర్ సీఐ శ్రీనివాస్ రావు, అప్పటి ఎస్ఐ ఎం. సంపత్, ప్రస్తుత సీఐ తిరుపయ్య, ఎస్ఐ రాములు, కోర్టు లైజనింగ్ అధికారి ఏఎస్ఐ రామేశ్వర్ రెడ్డి, సీడీవో మోహన్ సింగ్‌లను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించారు. జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని, సమర్థవంతమైన దర్యాప్తు ద్వారా నేరస్థులను చట్టం ముందు నిలబెట్టడం కొనసాగుతుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# నీలోఫర్ లో బాలింతలకు కనీస వైద్య సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరం

- హాస్పిటల్ లో వసతులను పరిశీలిస్తామంటే మాపై దౌర్జన్యం చేశారు
- ప్రభుత్వం మెడలు వంచి బాలింతలకు సరైన వైద్య సదుపాయాలు అందేలా చూస్తాం
- తెలంగాణ రక్షణ సేన మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మనోజ గౌడ్



**హైదరాబాద్,డిడి9 వార్త,ఆగస్ట్ 4:**

నీలోఫర్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణులకు కనీస వైద్య సౌకర్యాలు అందడం లేదని ఆరోపిస్తూ తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పడాల మనోజ గౌడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని పరిస్థితులను పరిశీలించేందుకు మహిళా నాయకులు మంగళవారం నీలోఫర్ ఆసుపత్రిని సందర్శించగా, సెక్యూరిటీ సిబ్బంది మరియు ఆసుపత్రి సిబ్బంది తమను లోపలికి అనుమతించలేదని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా మనోజ గౌడ్ మాట్లాడుతూ, బాలింతలను మంచాలపై కాకుండా కుర్చీల్లో కూర్చోబెట్టి వైద్యం అందించడం అత్యంత బాధాకరమని అన్నారు. గర్భిణులు, బాలింతలు సరైన వైద్య సేవలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పరిస్థితులను చిత్రీకరిస్తున్న ఫొటోగ్రాఫర్ల నుంచి కెమెరాలు, మైకులు లాక్కునేందుకు ప్రయత్నించారని కూడా ఆరోపించారు. ఆసుపత్రిలో అన్నీ సక్రమంగా ఉంటే తమను లోపలికి ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించిన ఆమె, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు ఆసుపత్రి పరిస్థితులను పరిశీలించే హక్కు ఉందన్నారు. మహిళలకు కనీస వసతులు కూడా లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. ఒక్కో ఆసుపత్రి మంచాన్ని ముగ్గురు రోగులకు కేటాయిస్తున్నారని, శస్త్రచికిత్స అనంతరం స్ట్రెచర్‌పై తరలించాల్సిన రోగులను నడిపిస్తూ వార్డులకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితులు ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అన్నారు. నీలోఫర్ ఆసుపత్రిలో నెలకొన్న పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వంలోని మహిళా మంత్రులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బాలింతలు, గర్భిణులకు తగిన సంఖ్యలో పడకలు, వైద్య సిబ్బంది, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపడతామని హెచ్చరించారు. అయితే, తెలంగాణ రక్షణ సేన మహిళా నాయకులు చేసిన ఈ ఆరోపణలపై నీలోఫర్ ఆసుపత్రి యాజమాన్యం లేదా సంబంధిత ప్రభుత్వ అధికారుల నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

# అన్ని ఉపాధ్యాయ సంఘాలకు సమాన ప్రాధాన్యం కల్పించాలి

- బాన్సువాడ ఎంఈవో నాగేశ్వర్‌రావుకు ఉపాధ్యాయ సంఘాల వినతిపత్రం




**బాన్సువాడ, ఆగస్టు 04(డిడి9 వార్త):**

మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మంగళవారం బాన్స్వాడ మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావును కలిసి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, 2026 ఏప్రిల్–మే నెలల్లో నిర్వహించిన సెన్సస్ విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఇప్పటివరకు హాజరు ధ్రువపత్రాలు అందలేదని, వెంటనే వాటిని జారీ చేయాలని కోరారు.అదేవిధంగా మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలు, సమావేశాలు, ఇతర విద్యా సంబంధిత కార్యక్రమాల్లో ఒకే ఉపాధ్యాయ సంఘానికి ప్రాధాన్యం ఇవ్వకుండా అన్ని గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు సమాన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంఈవో నాగేశ్వర్‌రావు స్పందిస్తూ, తమ దృష్టిలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు సమానమేనని, ఎలాంటి వివక్షకు తావు ఉండదని స్పష్టం చేశారు. ఏ సంఘానికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చే ప్రసక్తే లేదని, అన్ని సంఘాల ప్రతినిధులు ఐకమత్యంతో కలిసి పనిచేస్తూ విద్యాభివృద్ధికి సహకరిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖకు మేలు జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి, నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్జీటీ యూనియన్, టీఆర్టీఎఫ్ యూనియన్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎమ్ యూనియన్, ఎస్సీ, ఎస్టీ యూనియన్, టిపియుఎస్ యూనియన్ నాయకులు పవార్ హీరాలాల్, శ్రీనివాస్‌రావు, జాగృతి, దేవి సింగ్, పోతుగంటి వార్ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

# వాసవి ప్రైమరీ స్కూల్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**



ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక వాసవి ప్రైమరీ స్కూల్‌లో బోనాల పండుగ ఉత్సవాలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి గంగయ్య పాల్గొని బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరిస్తూ ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో బోనాలను ప్రత్యేకంగా జరుపుకోవడం మన సాంప్రదాయమని తెలిపారు. అమ్మలగన్న అమ్మ జగన్మాత గ్రామంలోని ప్రజలందరినీ, పసిపిల్లలను చల్లగా చూడాలని, కోరిన కోరికలు తీర్చే ఆ తల్లి దివ్య దీవెనలు అందరికీ అందాలని కోరుకుంటూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కొత్త కుండలలో నైవేద్యం (బోనం) తయారుచేసి అమ్మవారికి సమర్పించే విధానం వెనుక ఉన్న భక్తిభావాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో విచ్చేసిన విద్యార్థుల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# ప్రథమ శ్రేణి విద్యార్థినికి రూ.11 వేల ప్రోత్సాహక బహుమతి

- విద్యార్థిని తల్లి, ప్రధానోపాధ్యాయుడిని ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లప్ప పటేల్



**బాన్సువాడ, ఆగస్టు 04(డిడి9 వార్త):**

పెద్దకొడప్‌గల్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ కాటేపల్లి పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని సాబ్లె నందిని తరఫున ఆమె తల్లి జేవంతి మధుసింగ్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లప్ప పటేల్ రూ.11 వేల విలువైన ప్రోత్సాహక చెక్కును మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థిని విజయానికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, నందిని తల్లి జేవంతి మధుసింగ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే జడ్పీహెచ్ఎస్ కాటేపల్లి పాఠశాల పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని కొనియాడారు.ఉపాధ్యాయుల తరఫున పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల ఇన్‌చార్జి విద్యాధికారి ప్రవీణ్ కుమార్‌ను మల్లప్ప పటేల్ శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సేవలను గుర్తించడం ద్వారా సమాజ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీ. యాదవ్, మూడ్ శంకర్, ఆర్. లలిత, వి. సునీత, ఎం. సుజాత, ఎం. భక్షిరామ్, జి. మంజుల, పి. అశోక్, దేవదాస్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోగా కాంగ్రెస్ మండల కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి

## సామాజిక న్యాయంతో పారదర్శకంగా కమిటీలు ఏర్పాటు చేయండి: డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్



**డిడి9 వార్త గుడిహత్నూర్:**

కాంగ్రెస్ పార్టీ 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ పార్టీ శ్రేణులకు కీలక సూచనలు చేశారు. మండల కమిటీల ఏర్పాటులో వర్గ విభేదాలకు తావివ్వకుండా, సామాజిక సమతుల్యతను పాటిస్తూ పారదర్శకంగా కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి కమిటీలో అధ్యక్షుడితో కలిపి 21 మంది సభ్యులు ఉండాలని, మహిళా నాయకులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలో పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) ఏర్పాటు చేసి, ఆగస్టు 15లోగా మండల కమిటీలతో పాటు గ్రామ, బూత్ స్థాయి కమిటీలను కూడా పూర్తి చేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, అడే గజేందర్, మల్లెపూల నరసయ్య, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, సాజిద్ ఖాన్, అల్లూరి సంజీవ్ రెడ్డి, గోక గణేష్ రెడ్డి, తోడసం దౌలత్ రావ్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో నిరుద్యోగులకు జాబ్ మేళా

## ఆగస్టు 6న కలెక్టరేట్ లో ఇంటర్వ్యూలు.. బీమా రంగంలో ఉద్యోగావకాశాలు

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 04(డిడి9 వార్త):**




కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు బీమా రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల ఆగస్టు 6 గురువారం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. కిరణ్ కుమార్ తెలిపారు.ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు కలెక్టరేట్ మొదటి అంతస్తులోని రూమ్ నెం. 121లో ఈ జాబ్ మేళా నిర్వహించబడుతుంది.ఇందులో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మరియు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. కామారెడ్డి జిల్లా పరిధిలోని కామారెడ్డి, గాంధారి, ఎల్లారెడ్డి, జుక్కల్, పిట్లం, బాన్సువాడ శాఖల్లో ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు.ఎల్ఐసి లో భీమా సఖి పోస్టుకు నెలకు రూ.7,000 స్టైపెండ్‌తో పాటు కమిషన్, రూరల్ కెరీర్ ఏజెంట్ పోస్టుకు రూ.5,000 స్టైపెండ్‌తో పాటు కమిషన్ అందజేయనున్నారు. అదనంగా గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ, వడ్డీ లేని అడ్వాన్స్ వంటి ప్రయోజనాలు ఉంటాయి. ఈ పోస్టులకు ఏదైనా డిగ్రీ విద్యార్హత అవసరం.శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్/అసోసియేట్ పోస్టులకు నెలకు రూ.19,000 వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ సదుపాయాలు, రూ.50,000 వరకు ప్రోత్సాహకాలు అందజేస్తారు. ఈ పోస్టులకు బైక్, స్మార్ట్‌ఫోన్ తప్పనిసరి. వయస్సు 19 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి.జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రెండు సెట్ల బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు.మరింత సమాచారం కోసం: 9292805290, 9849361428, 9949652313, 6305743423లను సంప్రదించవచ్చు.

# బీర్కూర్ లో వైభవంగా బొందిలి రాజాపుత్ కమ్యూనిటీ బోనాలు





**బాన్సువాడ, ఆగస్టు 04(డిడి9 వార్త):**

బీర్కూర్ మండల కేంద్రంలో శ్రీ బొందిలి రాజాపుత్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో మంగళవారం బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని శోభాయాత్రగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ బోనం ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామంలో సుఖశాంతులు, సుభిక్షం నెలకొనాలని ప్రార్థించారు. బొందిలి రాజాపుత్ సంఘం సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## రూ.1.70 కోట్ల సీసీ రోడ్డు పనులను పరిశీలించిన పీఆర్ డీఈ శారదా



**బాన్సువాడ, ఆగస్టు 04(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామంలో రూ.1.70 కోట్ల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) శారదా మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యత, సాంకేతిక ప్రమాణాలు, పనుల పురోగతిని ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పనులను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.పరిశీలన సందర్భంగా సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు, గ్రామ ప్రతినిధులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నూతన శక్తులతో ఎమ్మార్పీఎస్ బలోపేతం

### బీర్కూర్ మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 04(డిడి9 వార్త):**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నూతన శక్తులతో మరింత బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంథని సామ్యేల్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 32 సంవత్సరాలుగా సాగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనతో పాటు అనేక సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ మానవతా ఉద్యమంగా రూపాంతరం చెందిందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, గుండె జబ్బు పిల్లల కోసం ఆరోగ్యశ్రీ సాధన,వికలాంగులు,వృద్ధులు,వితంతువుల పెన్షన్ల పెంపు, ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్, రేషన్ బియ్యం పెంపు వంటి అనేక విజయాలు ఉద్యమ ఫలితాలేనని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి యువత, విద్యావంతులు ఉద్యమంలో భాగస్వాములు కావాలని, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మండల, జిల్లా స్థాయిలో కమిటీల పునర్నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. నూతన మండల కమిట సమావేశంలో బీర్కూర్ మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడు: మెక్క రమేష్ (బీర్కూర్)ప్రధాన కార్యదర్శి: బసొల్ల కుమార్ (చించోలి)కోశాధికారి నాని బాబు (బీర్కూర్) సలహాదారులుగా రాంసాని భూమయ్య (బీర్కూర్), బోయి పెద్ద లాలయ్య (బరంగేడ్గి), బసొల్ల శ్రీనివాస్ (చించోలి సర్పంచ్), మేత్రి చిన్న గంగారాం (అన్నారం)లను ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కాదేపురం గంగన్న, నాయకులు పెద్దబూరి గంగారాం, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు మావురం శ్రీకాంత్, బోయి చిన్న సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

**నిజామాబాద్ జిల్లా 04 ఆగస్టు(డీడీ9 వార్త) :**

గ్రామాలు సర్వాంగ సుందరంగా అభివృద్ధి చెందాలంటే మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని బషీరాబాద్ సర్పంచ్ జమున మహేష్ తెలిపారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో మంగళవారం ప్రత్యేక మహిళా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళలను గౌరవించిన చోటే శుభాలు కలుగుతాయని, గ్రామ స్వయం సహాయక సంఘాల సభ్యులు అన్ని సామాజిక, అభివృద్ధి కార్యక్రమాల్లో ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటా తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, ఉపసర్పంచ్ భూమేష్, వార్డు సభ్యులు లక్ష్మి రవి, రాకేష్ గౌడ్, చిలివేరి లక్ష్మి, నాయకులు బైకని మహేష్, డాక్టర్ మురళి, సీఏలు రజిత, రుచిత, భాగ్యలక్ష్మి, సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ 'బి', 'సి' పరీక్షల్లో క్షత్రియ విద్యార్థుల ప్రతిభ

**నిజామాబాద్ జిల్లా 04 ఆగస్టు(డీడీ9 వార్త) :**

ఇటీవల నిర్వహించిన ఎన్‌సీసీ 'బి', 'సి' సర్టిఫికేట్ పరీక్షల్లో క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల క్యాడెట్లు ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారని సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్ తెలిపారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో విజేతలైన క్యాడెట్లను అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావాన్ని పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు భవిష్యత్తులో సాయుధ దళాలు, పోలీస్, పారా మిలిటరీ రంగాల్లో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కట్కం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. క్రమశిక్షణ, నిరంతర శిక్షణతోనే ఈ విజయం సాధ్యమైందని ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ బ్రిజేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

- **బేటీ బచావో–బేటీ పడావో కింద ఆడశిశువులకు ఇన్ఫాంట్ బేబీ కిట్ల పంపిణీ**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగష్టు 04(డిడి9 వార్త):**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చర్మల్ తండా గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాల విలువ, శిశువుల ఎదుగుదలలో తల్లిపాల పోషక విలువలపై జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం బేటీ బచావో–బేటీ పడావో పథకం కింద ఆడశిశువుల జననం, ఆరోగ్యకరమైన ఎదుగుదలను ప్రోత్సహించే లక్ష్యంతో ఇటీవల ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు ఇన్ఫాంట్ బేబీ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామీణ స్థాయిలో జిల్లాలో తొలిసారిగా చర్మల్ తండా గ్రామంలో ప్రారంభించడం సంతోషకరమని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, తమ గ్రామంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని, ఆడపిల్లల జననం, గౌరవం, అభివృద్ధి కోసం గ్రామ ప్రజలందరూ కలిసి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, సూపర్వైజర్ వినోదిని, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# తాత్కాలిక వంతెన పనులు పూర్తి చేయాలి





- **లింగంపల్లి కుర్దు వద్ద దెబ్బతిన్న వంతెనను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి జిలా బ్యూరో, ఆగస్టు 04(డిడి9 వార్త):**

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా లింగంపేట మండలం లింగంపల్లి కుర్దు గ్రామం వద్ద దెబ్బతిన్న తాత్కాలిక వంతెన పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వంతెన పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, భవిష్యత్తులో కూడా ఇబ్బందులు తలెత్తకుండా బలమైన నిర్మాణ ప్రమాణాలను పాటించాలని సూచించారు.వంతెన మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు గ్రామస్తుల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు,

## ఆర్మూర్ నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**నిజామాబాద్ జిల్లా 04 ఆగస్టు(డీడీ9 వార్త) :**

ఆర్మూర్ పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ఊర పండగ ఉత్సవాలను పురస్కరించుకొని నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షులు, జీజీ ఫౌండేషన్ చైర్మన్ లయన్ గీత–నివేదన్ గుజరాతీ (ఎంజేఎఫ్) దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక నివేదనలు సమర్పించారు. అనంతరం లయన్ నివేదన్ మాట్లాడుతూ.. ఆర్మూర్, పరిసర గ్రామాల ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, వానలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

## ప్రజాసేవే పోలీసుల ముఖ్య లక్ష్యం




- **విధుల పట్ల అంకితభావం చాటిన సిబ్బందికి సీపీ సత్కారం**

**నిజామాబాద్ జిల్లా 04 ఆగస్టు(డీడీ9 వార్త) :**

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అంకితభావంతో పనిచేసినని జామాబాద్ టౌన్–6 పోలీస్ సిబ్బంది సేవలు అభినందనీయమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. బోధన్ వెళ్లే ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీటిని తొలగించేందుకు ఏఎస్ఐ జక్రయ్య, ఏఆర్ హెచ్‌సీ సాయిబాబా రోజంతా అక్కడే ఉండి డ్రైనేజీల్లో నిలిచిన చెత్తను తొలగింపజేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ నేపథ్యంలో కమిషనర్ కార్యాలయంలో వారిని సీపీ శాలువాలతో ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. ప్రకృతి వైపరీత్యాలు లేదా అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో సిబ్బంది చూపిన చొరవను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎసీపీ ప్రకాష్ యాదవ్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , టౌన్ 6 ఎస్సై సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షా ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 04(డిడి9 వార్త):**





జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్రతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్, జిల్లాలోని చెరువులు, వాగులు, రహదారులు, వంతెనలు, పాత భవనాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు.ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులు, వాగులు, కాలువలు వంటి నీటి ప్రవాహాల వద్దకు వెళ్లవద్దని, ముఖ్యంగా యువత సెల్ఫీలు, ఈత, ఉధృత ప్రవాహాలను దాటే ప్రయత్నాలు చేయరాదని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు.లింగంపేట మండలం లింగంపల్లి గ్రామ సమీపంలోని కేకేవై రహదారిపై భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతంలో చేపట్టిన పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని, ఆ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించబడినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని చెరువుల కట్టలు, వంతెనలు, కల్వర్టులు, రహదారులు, పాత భవనాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తిన వెంటనే రక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి పొంగిపొర్లుతున్నందున, పరివాహక ప్రాంతాలు, జీఆర్ కాలనీ, సమీప వార్డుల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరం లేకుండా చెరువు పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.జిల్లాలో ఇప్పటివరకు 171 గృహాలు దెబ్బతిన్నట్లు, వాటిలో 167 పాక్షికంగా, 4 పూర్తిగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. అలాగే 4 చెరువులు, 32 రహదారులు వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్నట్లు సమీక్షలో వెల్లడైంది. నష్టపరిహార అంచనా, పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518